# విస్తారంగా పత్తి..

- భీమిని మండలంలో 21,263 ఎకరాల్లో సాగు
- సస్యరక్షణ చర్యలు పాటించాలని వ్యవసాయ అధికారుల సూచన



నెన్నెల మండలంలో పత్తి సాగు

భీమిని, అక్టోబర్ 29 : భీమిని మండలంలో ప్రధాన పంటగా పత్తి పంట సాగవుతున్నది. కొన్నేండ్లుగా పత్తికి మంచి ధర పలుకుతున్న నేపథ్యంలో ప్రభుత్వం వానకాలంలో పత్తిని సాగు చేయాలని రైతులకు సూచించింది. ఈ మేరకు అధికారులు రైతులను చైతన్య పర్చడంతో పత్తి సాగు వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. నీటి అవసరం అంతగా లేకపోవడం, లాభాలు బాగుండడంతో రైతులు నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో పత్తి సాగుపై దృష్టి సారించి పత్తి పంటలను సాగు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా ప్రతి సాగు లక్ష్యంలో అధికంగా పత్తి పంట సాగు పూర్తయింది. మండలంలో 6224 మంది రైతులు 21,263 ఎకరాల్లో పత్తిని సాగు చేస్తున్నారు. 2235 మంది రైతులు 3433 ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తున్నారు. రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారులు సూచనలు తీసుకుంటూ పంటలు సాగు చేస్తున్నారు.

**మద్దతు ధర పెరగడంతో పత్తి సాగు వైపు..**

పత్తి సాగు పెరగడానికి తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న చర్యలు సైతం తోడ్పాటు అందిస్తున్నాయి. నకిలీ విత్తన విక్రయాలపై ప్రభుత్వం కొరఢా ఝులిపించడంతో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులోకి వచ్చాయి. పత్తికి మద్దతు ధర రూ.7020 ప్రకటించడం కూడా రైతుల పాలిట వరంగా మారింది. సాగు ఖర్చు పెరిగినప్పటికీ దిగుబడులు పెరగడం, ధర సైతం ఆశాజనకంగా ఉండడంతో రైతులు పత్తి వైపు మొగ్గు చూపుతున్నారు.

### పత్తి సాగులో జాగ్రత్తలు తీసుకోవాలి..



ఇప్పుడున్న పరిస్థితుల్లో బెట్ట నెలకొన్నది. రైతులు బెట్ట పరిస్థితి నుంచి కాపాడుకోవడానికి పత్తిలో చేపట్టాల్సిన చర్యల్లో భాగంగా పొటాషియం నైట్రేట్ లేదా మల్టీకేర్ అనే మందును లీటరుకు 10 గ్రాముల చొప్పున వారం రోజుల్లో రెండుసార్లు పిచికారీ చేయడం వల్ల మొక్క బెట్ట గురికాకుండా కాపాడుకోవచ్చు. దీంతో దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది. రైతులకు సందేహాలుంటే తమను సంప్రదిస్తే సలహాలు అందిస్తాం.

-విజయ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి

### వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



ప్రస్తుత పరిస్థితుల్లో ఆకుముడత పురుగును గమనించాం. ఇప్పుడు ఆకులను ముడుచుకుని లోపల పదార్థాన్ని తినడంతో తెల్లటి పొడవాటి చారలు ఏర్పడుతాయి. దీన్ని నామ్ తెగులు(బొమ్మిడి తెగులు) అంటారు. ఈ పురుగు నివారణకు యూరియా వేయడం ఆపాలని, కొబ్బరి తాడుతో ఇరువైపులా లాగడం ద్వారా ముడుచుకున్న ఆకు తెరుచుకున్న సమయంలో క్లోరాంతనిల్‌ప్రోల్ లీటర్ నీటికి 0.4 ఎంఎల్ మందు పిచికారీ చేస్తే ప్రభావం ఎక్కువ చూపించి త్వరగా నివారణ జరిగి పంట దిగుబడి పెరుగుతుంది.

-వినోద్‌కుమార్, వ్యవసాయ విస్తీర్ణ అధికారి

# నియోజకవర్గ అభివృద్ధిని చూసే బీఆర్ఎస్‌లో చేరికలు

- బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య
- తాండూర్, కన్నెపల్లి మండలాల నుంచి ఇతర పార్టీల నుంచి చేరిన నాయకులు, కార్యకర్తలు



తాండూర్ మండలం నుంచి పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



కన్నెపల్లి మండలం నుంచి పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, అక్టోబర్ 29: బెల్లంపల్లి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో జరిగిన అభివృద్ధి చూసి ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య స్పష్టం చేశారు. ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తాండూర్ మండలానికి చెందిన 20 మంది ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తొమ్మిదేళ్లుగా నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతున్నాయని గుర్తు చేశారు. గ్రామాలు మరింత అభివృద్ధి చెంది, ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలు మరింతగా బడుగు, బలహీన వర్గాలకు అందాలంటే బీఆర్ఎస్ పార్టీకి మూడవసారి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీలో చేరిన వారు పుల్లం శ్రీకాంత్, ప్రదీప్, ఆకుల రవికాంత్, బొడ్డు సిద్దార్థ, శంకర్, శ్రీను, శివ, మహేందర్, మహేష్, రజనీకాంత్, గణేశ్, అనిల్, మండల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**కన్నెపల్లి మండలంలో...**

కన్నెపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన 20 మంది ఇతర పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలు చేరారు. వారికి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కండువా కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 60 ఏండ్లలో చేయని అభివృద్ధి కేవలం తొమ్మిదిన్నర ఏండ్లలో జరిగిందని వివరించారు. కాంగ్రెస్ పార్టీ మాయమాటలు నమ్మి వారికి ఓటు వేస్తే అభివృద్ధి 60 ఏండ్లకు వెనుకకు పోతుందని తెలిపారు. స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉంటున్న తనను ఆదరించాలని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీలో చేరిన వారు కామెర శంకర్, దుర్గం కళావతి, రమేశ్, రాజేశం, భీమేశ్, రాజేశ్వరి, సోమయ్య, గంగక్క, లక్ష్మి, భారతి, నీలక్క, మండల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### దండారీ నిర్వహణ కమిటీ ఎన్నిక



దండారీ దర్బార్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

కాసిపేట, అక్టోబర్ 29 : కాసిపేట మండలంలోని దేవాపూర్ సల్పాలవాగు వెంకటాద్రి దేవాలయం వద్ద ఆదివారం ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో దండారీ దర్బార్ నిర్వాహణపై సమావేశం నిర్వహించి నిర్వాహణ కమిటీ వేశారు. నవంబర్ 8,9 తేదీల్లో దండారీ ఉత్సవాలను నిర్వహించేందుకు తీర్మానం చేశారు. అనంతరం దండారీ దర్బార్ నిర్వాహణ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ఆడె జంగు, ప్రధాన కార్యదర్శిగా మడావి అనంతరావు, కోశాధికారిగా రాయిసిడం రమేశ్, ఉపాధ్యక్షులుగా కనక రాజు, పెంద్రం ప్రభాకర్, రాయిసిడం రాందాస్, సిడం జంగు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పెంద్రం హన్మంతు, వెడ్మ కిషన్, కార్యదర్శులుగా మడావి రమేశ్, సిడం గణపతి, మడావ దర్మారావ్, సిడం శంకర్‌లతో పాటు పూర్తి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివాసీలు అధిక సంఖ్యలో పాల్గొని దండారీ ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### 'వేదప్రకాశ్‌కు బీఆర్ఎస్‌తో సంబంధం లేదు'

బెల్లంపల్లి, అక్టోబర్ 29: వేదప్రకాశ్‌కు బీఆర్ఎస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని బీఆర్ఎస్ బెల్లంపల్లి పట్టణ కమిటీ ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి సంబంధం లేదని,ఆ వ్యక్తి ఏనాడు కూడా పార్టీ కండువా కూడా కప్పుకోని వ్యక్తి అధికార పార్టీ అని చెప్పుకోవడం శోచనీయమన్నారు. బీఆర్ఎస్ పార్టీ రెబల్ వ్యక్తి అని ప్రకటించుకోవడం విడ్డూరంగా ఉందని ఆరోపించారు. ఈ విషయాన్ని పట్టణ ప్రజలు గమనించాలని సూచించారు.

### భాగవత సప్తాహం ప్రారంభం

కన్నెపల్లి, అక్టోబర్ 29 : కన్నెపల్లి మండల కేంద్రంలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భాగవత సప్తాహం ప్రారంభమైంది. సప్తాహాన్ని బ్రహ్మశ్రీ మారుపాక సత్యనారాయణ శర్మ వివరించారు. ఐదు రోజుల పాటు సప్తాహం కొనసాగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### సోమగూడెంలో గౌడ సంఘం సమావేశం



సమావేశంలో పాల్గొన్న గౌడ సంఘం నాయకులు

కాసిపేట, అక్టోబర్ 29 : సోమగూడెం భరత్ కాలనీ గ్రామంలో ఆదివారం గౌడ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం బలోపేతంతో పాటు అభివృద్ధికి చేయాల్సిన ప్రణాళికపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొరికొప్పుల ప్రమీలాగౌడ్, బైరగొని సిద్ధయ్య, శ్రీకర్, చంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### పేలిన ట్రాన్స్‌ఫార్మర్..తప్పిన ప్రమాదం



ఆవుడం గ్రామంలో పేలిన ట్రాన్స్‌ఫార్మర్

నెన్నెల,అక్టోబర్29: మండలంలోని ఆవుడం గ్రామంలో ఆదివారం ట్రాన్స్‌ఫార్మర్ పేలింది. గ్రామంలోని రామాలయం సమీపంలో ఉన్న 15 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పైన తీగలకు మంటలు చెలరేగాయి ఆ వెంటనే మంటలు ట్రాన్స్‌ఫార్మర్‌కు అంటుకున్నాయి. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ ఒక్కసారిగా పేలిపోయి అందులో ఉన్న ఆయిల్ అంతా కింద పడి పోయింది. ఆయిల్‌కు మంటలు అంటుకున్నాయి. సమీపంలో ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. మంటలు ఇండ్లకు అంటుకుంటే పెద్ద ప్రమాదమే జరిగేది. ట్రాన్స్‌ఫార్మర్ పేలిన విషయాన్ని సర్పంచ్ చీర్ల సత్తమ్మ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

### గుడుంబా స్థావరాలపై దాడి



బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎస్ఐ

నెన్నెల, అక్టోబర్29 : మండలంలోని శ్రావణపల్లి గ్రామంలో గుడుంబా తయారీ స్థావరాలపై దాడి చేసి 25 లీటర్ల గుడుంబాను స్వాధీన పర్చుకున్నట్లు ఎస్ఐ శ్యామ్ పటేల్ తెలిపారు. ఆదివారం శ్రావణ్ పల్లి గ్రామంలో గుడుంబా తయారు చేస్తున్న స్థావరాలపై దాడులు చేయగా 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. డేగరి వెంకటేశ్ వద్ద 25 లీటర్లు గుడుంబా లభించగా స్వాధీనం చేసుకుని అతిని పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.